క్లుప్తంగా

వెండి ఉరువులు సమర్పణ



అంజూరు శ్రీనివాసులుకు వెండి ఉరువులు అందజేస్తున్న తీగల హేమంత్‌కుమార్

రేణిగుంట: శ్రీకాళహస్తీశ్వరాలయానికి గురువారం పట్టణానికి చెందిన తీగల కోటేశ్వరరావు కుమారుడు తీగల హేమంత్‌కుమార్ రూ.1.78లక్షల విలువైన వెండి ఉరువులు, వెండి శంఖం, వెండి చెంబులను ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. అనంతరం దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా స్వామి అమ్మవార్ల దర్శనం చేయించి, శేషవస్త్రాలతో సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో తీగల భాను, వేలూరు రమేష్, పసుపులేటి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువతకు క్రీడాసామగ్రి పంపిణీ



యువకులకు క్రీడాసామగ్రిని అందజేస్తున్న సీఐ ఆరోహణరావు

రేణిగుంట: మండలంలోని ఎల్లమండ్యం దళితవాడకు చెందిన యువతకు ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రేణిగుంట మండల అధ్యక్షుడు పిల్లపాళెం రాము ఆధ్వర్యంలో గురువారం క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. గాజులమండ్యం సీఐ ఆరోహణరావు, ఎస్ఐ ధర్మారెడ్డి చేతులమీదుగా వీటిని యువకులకు అందజేశారు. ఆషా సంస్థ అధ్యక్షుడు జూలియస్‌రాజు, పిల్లపాళెం రాము కలసి యువకుల కోసం క్రికెట్, వాలీబాల్ కిట్లను వితరణ చేశారు. యువత వేసవి సెలవుల్లో క్రీడానైపుణ్యాలను మెరుగు పరచుకోవాలని కోరారు.

భూసమస్యలు పరిష్కరిద్దాం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని నూతన తహసీల్దారు హనుమాన్‌నాయక్ కోరారు. గురువారం తన కార్యాలయంలో ఆయన సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. భూమి లేని పేదలను గుర్తించి, అర్హులైన వారికి భూ పంపిణీ చేసే దిశగా దృష్టి సారించాలన్నారు. పరిష్కారానికి నోచుకోని సమస్యలను తన దృష్టికి తేవాలన్నారు. చెరువుల ఆక్రమణలుంటే అడ్డుకోవాలని, రైతులు భూములకు సంబంధించిన సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ శివయ్య, ఆర్ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత సంఘం కార్యదర్శిగా సుబ్రమణ్యం



చేనేత సంఘం కార్యదర్శిని అభినందిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: వైఎస్సార్‌సీపీ జిల్లా చేనేత సంఘం కార్యదర్శిగా సి.సుబ్రమణ్యం నియమితులయ్యారు. తన ఎంపికపై సుబ్రమణ్యం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను గురువారం కలసి కృతజ్ఞతలు తెలిపారు. నేత కార్మిక సంఘం నాయకుడికి శాలువా కప్పి ఎమ్మెల్యే సన్మానించారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ వి.ప్రతిమ, జెడ్పీటీసీ సభ్యురాలు పి.వి జయలక్ష్మి, మండల కన్వీనర్ కే. సుశీల్ కుమార్‌రెడ్డి, మాస్టర్‌స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్‌రెడ్డి, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

పుత్తూరు రూరల్: సీఐటీయూ అనుబంధ షేర్ ఆటో వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా సుధాకర్, ఉపాధ్యక్షుడిగా వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా రామలింగంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు.

భోగేశ్వరస్వామి శివలింగ ప్రతిష్ఠ



భోగేశ్వరస్వామి శివలింగానికి హోమపూజలు చేస్తున్న అర్చక, వేదపండితులు

రేణిగుంట: శ్రీకాళహస్తి మండలం తొండమానపురంలోని భోగేశ్వరస్వామి శివలింగాన్ని గురువారం ఆలయ పండితులు పునఃప్రతిష్ఠకు హోమపూజలు చేశారు. వందేళ్ల కిందట శిథిలావస్థలో మూలన పడి ఉన్న భోగేశ్వరస్వామి శివలింగాన్ని పునఃప్రతిష్ఠించాలని గ్రామస్తులు తీర్మానం మేరకు గురువారం ప్రత్యేక హోమపూజలు చేసి ధాన్యంలో విగ్రహాన్ని భద్రపరిచారు. 21వ రోజు విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది.

'లోకోస్'లెక్క..ఇక పక్కా..!

పాకాలకు చెందిన సునీత వివాహమై నారాయణవనంకు వచ్చింది. అక్కడ తాను డ్వాక్రా సంఘాల్లో అప్పటికే నమోదై ఉంది. గ్రూప్ ఖాళీ ఉండడంతో ఇక్కడ కూడా తన పేరులో నమోదు చేసుకుంది. ఈ నేపథ్యంలో రెండు గ్రూపుల్లోనూ ఆమె రుణం పొందింది. రెండు చోట్లా జగనన్న ఆసరా వంటి పథకాల లబ్ధి పొందుతోంది. ఇకపై ఇలాంటి డబుల్ గేమ్‌కు చెక్ పెట్టేందుకు కేంద్రం దృష్టి సారించింది. ఇందుకోసం లోకోస్ యాప్ రూపొందించింది.

- యాప్‌తో డ్వాక్రా సంఘాల వివరాలన్నీ ఒకేచోట
- పారదర్శకంగా సంఘాల నిర్వహణ
- మండలంలో వైకేపీ సంఘాలు :39
- సంఘాల సభ్యులు : 9,452



సంఘమిత్రలకు లోకోస్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నారాయణవనం: ఇప్పటివరకు రాష్ట్ర డ్వాక్రా సంఘాలకు ఇచ్చే రుణాల వివరాలు, దీనికి సంబంధించి ఈకేవైసీలు వివిధ యాప్‌ల వినియోగంతో సాంకేతికంగా ఇబ్బందులు తలెత్తడంతో కేంద్ర మంత్రిత్వ శాఖ రూపొందించిన లోకోస్ యాప్‌ను ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చింది. ఈ యాప్‌లో వైఎస్సార్ క్రాంతి పథం సంఘాల సభ్యుల వివరాలు, వారు పొందే రుణాలు, సంఘ కార్యకలాపాలు, సమావేశాలు వంటి వివరాలను నమోదు చేయనున్నారు. లోకోస్ యాప్ మే నెల ప్రారంభం నుంచి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సంబంధిత అధికారులు చెప్పారు.

పూర్తి పారదర్శకత

లోకోస్ యాప్ ద్వారా డ్వాక్రా సంఘాల నిర్వహణ ఇకపై పూర్తి పారదర్శకతతో ఉండనుంది. ఎవరైనా మహిళలు రెండు గ్రూపులలో సభ్యులు ఉంటే యాప్‌తో దీనిని గుర్తించడానికి వీలవుతుంది. అలాగే రుణాల విషయంలో వారి ఆర్థిక పరిస్థితిని అంచనా వేసి మంజూరు చేసే అవకాశం ఉంటుంది.

మరోవైపు డ్వాక్రా మహిళల కుటుంబ పరిస్థితులు, వారి పిల్లల విద్యా వ్యవహారాలు వంటివి కూడా యాప్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుంది. తద్వారా మహిళలకు ప్రభుత్వం ద్వారా ఎలాంటి చేయూతనివ్వాలో ప్రణాళిక రూపొందించుకునే అవకాశం ఉంటుందని అధికారులు చెప్పారు.

సమాచారమంతా ఒక్కచోటే..

లోకోస్ యాప్‌తో డ్వాక్రా సంఘాలలోని సమాచారం అంతా ఒక చోట లభ్యం కానుంది. డ్వాక్రా గ్రూపుల్లోని మహిళల ఆర్థిక పరిస్థితి, వారి కుటుంబ వ్యవహార పరిస్థితి తెలుసుకునేందుకు వెసులుబాటు కలిగి ఉంటుంది. వీరికి ప్రభుత్వం ఏవిధమైన సహాయం అందిస్తుందో ఆ వివరాలు అన్ని ఒకచోటే తెలుసుకునే వెసులుబాటు కలుగుతుంది.

– మమత, ఏపీఎం, నారాయణవనం

ఎమ్మెల్యే 'నిఖా' కానుక



నిఖా కానుక అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: స్థానిక బుగ్గవీధికి చెందిన నవవధువు కరిష్మాకు గురువారం రాత్రి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మేనమామ సాంగ్యం అందజేశారు. రేణిగుంటలోని పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే నూతన వధూవరులను ఆశీర్వదించి డబుల్‌కాట్ బెడ్, బీరువా అందజేశారు. మైనారిటీ కుటుంబాలకు వివాహం కుదిరితే నిఖా కానుక కింద ఎమ్మెల్యే వీటిని అందజేస్తుండటం విదితమే. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, వైస్ ఎంపీపీ సుజాత, మిథున్ తదితరులు పాల్గొన్నారు.

ఎలమండ్యంలో సమ్మర్ క్యాంప్



సమ్మర్ క్యాంపులో చిన్నారులు, శిక్షకులు

రేణిగుంట: సమ్మర్ క్యాంపులో పిల్లలు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సిర్ప్స్ సంస్థ కార్యదర్శి మరుపూరి శేఖర్ కోరారు. మండలంలోని ఎలమండ్యంలో గురువారం సిర్ప్స్ సంస్థ, ధాత్రి ఫౌండేషన్ సంయుక్తంగా పిల్లలకు ఉచిత సమ్మర్ క్యాంపును ప్రారంభించాయి. నెల పాటు విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ శిబిరం ఏర్పాటు చేశామని, విజ్ఞాన సముపార్జనతోపాటు ఆటపాటలు, డ్రాయింగ్ మొదలైన వాటిలో శిక్షణ ఇస్తామన్నారు. గురువారం విద్యార్థులకు ఇంగ్లిష్ గ్రామర్ పుస్తకాలను, విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ తేజోవతి, కల్పన పాల్గొన్నారు.

మురుగు కాలువ నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ రాధాకృష్ణ

ఏర్పేడు: మండలంలోని రావిళ్లవారికండ్రిగలో గురువారం సర్పంచ్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో మురుగు నీటి కాలువ నిర్మాణానికి భూమిపూజ చేశారు. మురుగు కాలువలు లేక పడుతున్న ఇబ్బందులను గ్రామస్తులు పార్టీ నాయకుల ద్వారా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని కలిసి నివేదించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి, మురుగు కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

దోమల నిర్మూలనకు చర్యలు



బోదకాలు రోగులకు సోపులు, టవళ్లు పంపిణీ చేస్తున్న రవిరాజు తదితరులు

నారాయణవనం: ఆరోగ్య జీవితానికి దోమలు, హానికర కీటకాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా రవిరాజు మాట్లాడారు. దోమలు, కీటకాల కాటు మూలాన సాధారణ స్థాయి నుంచి ప్రాణాంతక స్థాయికి రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. దోమలతో మలేరియా, డెంగీ, చికున్ గున్యా, మెదడువాపు, బోదకాలు తదితర వ్యాధుల బారిన పడతారని వివరించారు. పీహెచ్‌సీ మెడికలాఫీసర్ రాగసుధ వ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని తప్పనిసరిగా పాటించేలా చూడాలని సిబ్బందికి సూచించారు. సీహెచ్‌ఓ శ్రీనివాసులు, సబ్ యూనిట్ అధికారి మోహన్‌బాబు మాట్లాడారు. జ్వరపీడితులు తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రిలోనే చికిత్స పొందాలని కోరారు. అనంతరం బోదకాలు వ్యాధిగ్రస్తులకు ప్లాస్టిక్ బకెట్, మగ్గు, సోపులు, టవల్, మందులను పంపిణీ చేశారు.

విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపాలి

వెంకటగిరి: పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపి, పరీక్షలకు సన్నద్ధం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని గూడూరు డీవైఈఓ శివప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, ఆర్‌వీఎం ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించారు. టెన్త్ ఫెయిలైన విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోందన్నారు.

ఆధార్ సమస్యల పరిష్కారానికే ప్రత్యేక శిబిరాలు



ఆధార్‌ను అప్‌డేట్ చేసుకుంటున్న కార్డుదారుడు

బుచ్చినాయుడుకండ్రిగ: ఆధార్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. గురువారం బుచ్చినాయుడుకండ్రిగ గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ శిబిరాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. అర్హత ఉన్ననూ ఆధార్ సమస్యలతో పలువురు ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారని, దీనిని గుర్తించిన ప్రభుత్వం ప్రత్యేకంగా సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేసి, సమస్యలను పరిష్కరిస్తోందన్నారు. 41 మంది వివరాలను అప్‌డేట్ చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వీఆర్‌ఓ పాల్గొన్నారు.

సారె ఊరేగింపునకు విస్తృత ఏర్పాట్లు



సమీక్షిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరను పురస్కరించుకుని మున్సిపల్ కార్పొరేషన్ తరపున అమ్మవారికి సారె సమర్పించేందుకు ఏర్పాట్లు చేయాలని కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. ఆమె గురువారం వివిధ విభాగాధిపతులతో సారె ఊరేగింపుపై సమీక్షించారు. అన్ని విభాగాల తరపున మున్సిపల్ కార్పొరేషన్ అధికారికంగా అమ్మవారికి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు సారె సమర్పించనున్నట్లు చెప్పారు. సారె ఊరేగింపు సమయంలో రోడ్డుపై నడిచే భక్తులు, కళాకారులు, ఉద్యోగులకు అనువుగా వాటర్ ట్యాంకర్లతో నీరు పట్టించాలన్నారు. దారిపొడవునా మంచినీరు, మజ్జిగ పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి రిజర్వాయర్ రోడ్డు, ఓల్డ్ మెటర్నిటీ రోడ్డు, భవానీనగర్ జంక్షన్, వీవీ మహల్ రోడ్డు, ఓల్డ్ మున్సిపల్ కార్పొరేషన్ సర్కిల్, తుడా సర్కిల్ మీదు గా సారె ఊరేగింపు ఉంటుందన్నారు. అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, ఎస్ఈ మోహన్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఆర్వో కేఎల్ వర్మ, ఎగ్జామినర్ రామచంద్రారెడ్డి, సెక్రటరీ రాధిక, చిట్టిబాబు పాల్గొన్నారు.

మరగాళ్లు.. భక్తి పరవళ్లు



గంగమ్మకు కరగాటం మొక్కు చెల్లిస్తున్న యువకులు

- గంగమ్మకు మొక్కుల చెల్లింపు
- పేరంటాళ్ల వేషధారణలో యువకులు
- మట్టి విగ్రహానికి అలంకరణ, మొక్కులు



గంగమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: సత్యవేడు గంగ జాతర వేడుకల్లో యువకులు, పిల్లలు 'గంగమ్మకు మరగాళ్ల నృత్యం' మొక్కును చెల్లించడం ఆనవాయితీ. గంగమ్మను దింపే ముందు,. సాగనంపే తంతు సమయంలో ఈ మొక్కులు చెల్లిస్తారు. సత్యవేడులో బుధవారం రాత్రి ప్రారంభమైన గంగమ్మ ఊరేగింపు గురువారం ఉదయం 7 గంటలకు సాగింది. పర్ణశాలలో గంగమ్మను ఉంచి భక్తుల దర్శనం కల్పించారు. గ్రామపరిధిలో అష్టబంధనం కట్టిన వీధులలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కరగాటం నృత్యప్రదర్శనలు చేశారు. నృత్యం చేస్తున్న యువకులకు గుమ్మడికాయల దిష్టి తీశారు. మరగాళ్ల నృత్యం(ఒంటికి నిమ్మకాయలు దారాలతో గుచ్చుకొని, కాళ్లకు చెక్కలు కట్టుకుని డప్పు మోతకు అనుగుణంగా నృత్యం చేయడం) ఆకర్షణ.

మట్టి విగ్రహానికే అలంకరణ, మొక్కులు

గంగమ్మ రూపాన్ని బంకమట్టితో గ్రామ కుమ్మరి ప్రత్యేకంగా తయారు చేశారు. మట్టి విగ్రహానికి గ్రామ రజకుని ఇంట విశేష అలంకరణ చేశారు. తప్పెట్లు, వాయిద్యాల హోరు, బాణసంచా మోత నడుమ రజకులు వంతుల వారీగా అమ్మవారిని మోస్తూ వీధులలో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి కర్పూర హారతులు పట్టారు. మహిషాసుర మర్ధిని రూపంలో అమ్మవారు భక్తులకు దర్శమిచ్చారు. వేలాదిగా తరలి వచ్చి భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

వేపచీర మొక్కులు

కోరిన కోర్కెలు తీరిన వారు, అనారోగ్యం నుంచి కోలుకున్నవారు వేపచీర(వేపాకు శరీరానికి చుట్టుకొని) పొర్లు దండాలు పెడుతూ అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

గురువారం ఉదయం నడివీధిలోని పర్ణశాలలో కొలువైన గంగమ్మను పార్టీ నాయకులతో కలిసి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దర్శించుకున్నారు. ముదిరాజ్‌సంఘం, బేరిసంఘం, దేవాంగ సంఘాలు పలు ప్రాంతాల్లో అన్నదానాలు చేశాయి. మరికొందరు మజ్జిగ పంపిణీ చేశారు.

'పిల్లలను స్కూళ్లకు పంపండి..పనులకు కాదు'



పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న యువనేస్తం అసోసియేషన్ సభ్యులు

తొట్టంబేడు (రేణిగుంట): చిన్న పిల్లలు బడిలో మాత్రమే ఉండాలని పనిలో కాదని యువనేస్తం అసోసియేషన్ అధ్యక్షులు మునిశేఖర్ అన్నారు. గురువారం అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి మండలంలోని అబ్బాబట్లపల్లె ఎస్టీ కాలనీ, చుక్కల నిడిగల్లు ఎస్టీ కాలనీలో పిల్లలు, పిల్లల తల్లిదండ్రులతో యువనేస్తం వలంటీర్లు సమావేశం నిర్వహించారు. మునిశేఖర్ మాట్లాడుతూ, ఎస్టీ కాలనీలలో ఉన్న పిల్లలను స్కూళ్లలో చేర్పించాలని, పనులకు పంపరాదని విజ్ఞప్తి చేశారు. పిల్లల చదువుతోనే ఎస్టీ కాలనీలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ శ్రీకాళహస్తి మండల కో–ఆర్డినేటర్ నాగమణి, అరుణ, వలంటీర్లు లక్ష్మి, వెంకటేష్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో అగ్నిగుండ ప్రవేశం



అగ్నిగుండంలో ప్రవేశిస్తున్న భక్తులు

ఏర్పేడు: మండలంలోని రాజుపాలెంలో గురువారం తెల్లవారుజామున పాండురంగ స్వామి అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. తొలుత స్వామివారి చిత్రపటానికి విశేష పూజలు చేశారు. అనంతరం అగ్నిగుండంలో ప్రవేశించే భక్తులు కంకణాలు ధరించి, 9 బావుల్లో పవిత్ర స్నానాలు ఆచరించి, పసుపు దుస్తులు ధరించి, గోవిందనామ స్మరణతో నిలుచున్నారు. స్వామివారి చిత్రపటాన్ని అగ్నిగుండం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయ పూజారి అగ్నిగుండంలో పూల బంతిని వేసి ప్రవేశించగా భక్తులు ఆయనను అనుసరించారు. పలు ప్రాంతాల భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఆలయంలో బోరు వేశారు



బోరు డ్రిల్లింగ్ చేయిస్తున్న శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

రేణిగుంట: శ్రీకాళహస్తి దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం శ్రీకాళహస్తి బహదూరుపేటలోని శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నూతన బోరు డ్రిల్లింగ్ పనులను ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు గురువారం ప్రారంభించారు. బహదూరుపేట వాసులు ఇటీవల ఆలయంలో భక్తుల సౌకర్యార్థం మంచినీటి బోరు వేయించాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని కోరారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ఆలయ చైర్మన్ బోరు పనులు పూర్తి చేశారు. పుష్కలంగా నీళ్లు పడడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్రమణ్యం ఆచారి, వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రరాజు, కొల్లూరు హరినాయుడు, విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు వెంకటేష్ ఆచారి, శంకర్ ఆచారి, ఆనంద్ ఆచారి, ప్రసాద్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

రూ. 72వేల మద్యం బాటిళ్లు ధ్వంసం

సూళ్లూరుపేట: వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యాన్ని ధ్వంసం చేశామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ సీఐ జానకిరామ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2022–23 సంవత్సరంలో 33 కేసుల్లో అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి మొత్తం 504 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఆవరణలోనే దానిని ధ్వంసం చేసినట్లు చెప్పారు. 499 క్వార్టర్, 5 ఫుల్ బాటిళ్లు ఉన్నాయన్నారు. వీటి విలువ సుమారు రూ.72 వేలు ఉంటుందని తెలిపారు.









బండ వేషాలతో భక్తుల కేరింతలు



ప్రత్యేక అలంకరణలో తాతయ్యగుంట గంగమ్మ



కళాబృందాల ప్రదర్శన

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ జాతరలో రెండోరోజు గురువారం భక్తుల బండ వేషాలతో నగరం హోరెత్తింది. చిన్నా పెద్దా తేడా లేకుండా వేషధారణతో గంగమ్మ ఆలయానికి చేరుకుని ఆలయ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కొందరు కుటుంబ సమేతంగా పొంగళ్లు పెట్టారు. అమ్మవారి మూలవిరాట్టుకు విశేష పూజలు చేశారు.

నేడు తోటి వేషం

జాతరలో మూడో రోజు శుక్రవారం తోటి వేషాలతో భక్తులు గంగమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకోనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం బొగ్గుపొడిని శరీరమంతా పూసుకుని తెల్లనామం, కనుబొమ్మల పైన చుక్క బొట్లు పెట్టుకుంటారు. పిల్లలు మీసాలను కూడా పెట్టుకుంటారు. తలకు రిబ్బన్లు, నడుముకు వేపాకు కట్టుకుంటారు. పాత పొరకలను, చాటను చేతపట్టుకుని ఎదురుపడిన వారిని తిన్నగా మోదుతూ ఊరేగుతారు. బూతు పాటలు పాడుతూ సాగుతారు. అనంతరం గంగమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారి పాదాల వద్ద వేపాకు, చాట, పొరకలు పడేస్తారు. అమ్మవారిని బూతులు తిడుతూ కేరింతలతో సందడి చేస్తూ భక్తి పూర్వంగా మొక్కులు చెల్లించుకుంటారు.

ప్రభుత్వ కళాశాలలో చేర్చరూ!



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ఏర్పేడు: పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులను పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో చేర్పాలని ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలోని పాపానాయుడుపేట సచివాలయంలో సర్పంచ్ లలిత అధ్యక్షతన విద్యార్థుల తల్లిదండ్రులకు సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ, ఈ ఏడాదిలో ఇంటర్ పరీక్షల్లో ఎక్కువమంది విద్యార్థులు పాసయ్యారన్నారు. తమ కళాశాలలో నైపుణ్యం కలిగిన అధ్యాపకులు విద్యాబోధన చేయడమే కాకుండా కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని గ్రామీణ విద్యార్థులను తమ కళాశాలలో చేర్పాలని కోరారు. ఈ నెల 14 నుంచి ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు ఇస్తామన్నారు. మాజీ సర్పంచ్ తంబా సుబ్రమణ్యం, వైఎస్సార్ సీపీ నాయకుడు కరుణాకరన్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.